## కాళేశ్వరం లో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం: ఈఓ మహేష్



దశ, మహాదేవపూర్: సరస్వతి అంత్య పుష్కరాలు సందర్భంగా కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి విచ్చేస్తున్న భక్తుల కోసం దేవాలయం ఆధ్వర్యంలో అన్నదాన సత్రం వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పుష్కర స్నానాల అనంతరం భక్తులు ఆహార సమస్యలు ఎదుర్కొనకుండా ప్రత్యేకంగా అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్నారు. దేవస్థానం సిబ్బంది, వాలంటీర్ల సమన్వయంతో అన్నదాన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు దేవస్థానం ఈఓ మహేష్ తెలిపారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తూ కాళేశ్వరం పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది.

## ప్రొఫెసర్ కె.నాగేశ్వరావుపై కేసులు ఎత్తివేయాలి




దశ, కామేపల్లి: మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వరావుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నమోదైన కేసులను తక్షణమే ఎత్తి వేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు దుగ్గి కృష్ణ, కామేపల్లి మండల సిపిఎం పార్టీ కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కామేపల్లి మండలం, మద్దులపల్లి గ్రామంలో కామేపల్లి మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు కుందూరు వెంకటరెడ్డి మాట్లాడుతూ..భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా కేసులు పెట్టడం సరి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. గత నాలుగు దశాబ్దాలుగా సామాజిక, రాజకీయ అంశాలపై ప్రొఫెసర్ నాగేశ్వరరావు నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్య దృక్పథంతో అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. నిరంతరం ప్రభుత్వ విధానాలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ, ప్రజాస్వామ్య చర్చలకు ఆయన దోహదపడుతున్నారని కొనియాడారు. వివిధ రాజకీయ పక్షాల నేతలు,ముఖ్యమంత్రులు సైతం గతంలో ఆయన అభిప్రాయాలను గౌరవించారని పేర్కొన్నారు.

## నేలకొండపల్లిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం



దశ, నేలకొండపల్లి: నేలకొండపల్లి స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు వద్ద భక్త రామదాసు సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెల్లగొర్ల లింగస్వామి - దేవి నాగమణి దంపతుల చిన్న కుమార్తె తెల్లగొర్ల సౌమ్య పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెల్లగొర్ల లింగస్వామి మాట్లాడుతూ, "ప్రజలకు సేవ చేయడం ఒక అదృష్టం. ఉన్నదానిలో కొంత భాగం పేదలకు, అవసరమైన వారికి దానం చేయడం ద్వారా సేవా భావం పెరుగుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్త రామదాసు సర్వీసెస్ సొసైటీ అధ్యక్షులు పచ్చ తిరుపతయ్య, మాజీ అధ్యక్షులు ఏటుకూరి వెంకట రామారావు, నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు తెల్లగొర్ల లింగస్వామి, కోడూరి వెంకటాచారి, మాజీ ఎంపీటీసీ గుడిపాటి ముక్కంటి, మేకల వెంకయ్యతో పాటు ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

## లోడింగ్ కార్మికులకు శాశ్వత హోదా కల్పించాలి

దశ, బెల్లంపల్లి: కాసిపేట మండలం దేవాపూర్ గ్రామంలోని ఓరియంట్ సిమెంట్ (అదానీ) కంపెనీలో పనిచేస్తున్న లోడింగ్ కార్మికులను శాశ్వత కార్మికులుగా గుర్తించాలని కోరుతూ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గుర్తింపు సంఘం నాయకులు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్‌రావు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న లోడింగ్ కార్మికుల సమస్యలను ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదన్నారు. కార్మిక చట్టాల ప్రకారం వారికి శాశ్వత హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మిక సంక్షేమ మండలి సీఈఓ డాక్టర్ గంగాధర్, లేబర్ కమిషనర్ పమీల సత్పతి, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వరంగల్, చీఫ్ కమిషనర్ ఆఫ్ లేబర్ (సెంట్రల్) హైదరాబాద్ అధికారులను కలిసి కార్మికుల సమస్యలను వివరించినట్లు తెలిపారు. కార్మికులకు చట్టపరంగా న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి భీమిని మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు మెరుగు శంకర్, సతీష్ రెడ్డి, సత్యనారాయణతో పాటు పార్వతి పెద్దిరాజు, అరుణ్, రమేష్, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి





- ఎన్టీఆర్ జీవితం భావితరాలకు ఆదర్శం.
- ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్ది రెడ్డి రాజా

దశ, సూర్యాపేట ప్రతినిధి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు నందమూరి తారక రామారావుకు వచ్చే జయంతి వరకు భారతరత్న ఇవ్వాలని, ఆయన జీవితం భావి తరాలకు ఆదర్శప్రాయమని ఎన్టీఆర్ అభిమాని, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నల్లాల బావి చౌరస్తా నందు డిసిసి కార్యదర్శి, ఎన్టీఆర్ అభిమాని నేరేళ్ళ మధు గౌడ్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లకు పైగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని దేవుడి పాత్ర ఏదైనా ఆ పాత్రకు వన్నె తేవడమే కాక, ఆ రూపం నిజమైన దేవుడేనని నమ్మేంతగా పాత్రలో ఒదిగిపోయే వ్యక్తి ఎన్ టి ఆర్ అని, పార్టీ పెట్టిన తొమ్మిది నెలలకే రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి సేవలను గుర్తించి ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ భారతరత్న ఇవ్వాలన్నారు. తెలుగు జాతి వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయులు ఎన్టీఆర్ అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రటరీ పెద్దిరెడ్డి కళ్యాణ్, డిసిసి కార్యదర్శి షేక్ మీరా, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలెబోయిన నర్సయ్య, కొండగడుపుల సూరయ్య,శ్రీపాది శంకర్, పొదిళ హరి, జితేందర్, బాణాల హరి, ఎల్లూరి వెంకటేశ్వర్లు, కొండా రాజేష్, నేరెళ్ల నరేష్, జాని మీయా, గుణగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మానాల సౌదీ సంఘం నూతన కార్యవర్గం

- అధ్యక్షుడిగా బత్తిని సురేష్ గౌడ్

దశ, రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన సౌదీ సంఘం సభ్యులు గురువారం నిర్వహించిన సమావేశంలో మానాల సౌదీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బత్తిని సురేష్ గౌడ్, క్యాషియర్‌గా యాసోజీ మురళిని ఎన్నుకున్నారు. సంఘం బోర్డు మెంబర్లుగా పుప్పాల గణేష్, జక్కు శంకర్, జక్కు రాజారాం, గుర్రపు సుధాకర్, ఓరగొండ శ్రీనివాస్, తాటికొండ గణేష్, లక్కాకుల రమేష్, గొల్లమడ గణేష్‌లకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ.. సౌదీలో ఉన్న మానాల గ్రామ ప్రవాసుల సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఆపద సమయంలో సభ్యులకు సహాయం అందించడం, గ్రామానికి సేవా కార్యక్రమాలు చేపట్టడం, సంఘ సభ్యుల మధ్య ఐక్యత పెంపొందించడం సంఘ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడు బత్తిని సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. సభ్యుల నమ్మకానికి తగిన విధంగా పనిచేస్తూ సంఘాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని అన్నారు. క్యాషియర్‌గా ఎన్నికైన యాసోజీ మురళి మాట్లాడుతూ, సంఘ నిధుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

## "ప్రపంచ తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరునామా"



- "ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత ఎన్టీఆర్ 103 వ జయంతి వేడుకలు ఘనంగా
- తారక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అల్పాహారం, మజ్జిగ పంపిణీ

దశ ఓయూ: స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను తారక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో తార్నాక పుష్పక్ బస్ స్టాప్ చలివేంద్రం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేసి అనంతరం అతిథులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కాట్రగడ్డ శివరామ్ ప్రసాద్ ద్వారా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డి. చక్రపాణి (అసిస్టెంట్ డైరెక్టర్, హార్టికల్చర్), కొత్త రామారావు, మోతే శోభన్ రెడ్డి, కె. అశోక్ కుమార్ గౌడ్, తోటకూర చంద్రమౌళయ్య, నల్లూరి శివరాం ప్రసాద్, కనకమేడల రాంబాబు, జొన్నలగడ్డ శేషగిరి రావు, రాచమల్లు ఇస్మాయిల్ రెడ్డి, కంద్రు బుచ్చియ్య చౌదరి, పాటిబండ్ల నాగేశ్వరరావు, రావి జయధీర్, కాకుమాను బుచ్చి పాపయ్య, దేవినేని రాధాకృష్ణ, కావూరి నరసింహ రావు, శేరి ఇంద్రసేన రెడ్డి కొసరాజు రాజేశ్వర రావు, మరియు NRI విజయ్ సారథి తో పాటు మరికొందరు NRI తానా సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని తారక సేవా సమాఖ్య నిర్వహణ కమిటీ సభ్యులు అడుసుమిల్లి చిట్టి వీరయ్య, నాగమల్లేశ్వరి మన్నె, నరేంద్ర బాబు కాట్రగడ్డ సమన్వయం చేశారు.




## యాసంగి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం

- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పాల్గొన్న కలెక్టర్ రాహుల్ శర్మ

దశ, పెద్దపల్లి: ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశం ఆయన నిర్వహించారు. సమావేశం అనంతరం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ యాసంగి సీజన్ లో లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 185 కొనుగోలు కేంద్రాల ద్వారా 65 వేలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి పెద్ద పల్లిలో 20 వేలు, వరంగల్ లో 20 వేల మెట్రిక్ టన్నులు, హన్మకొండ లో 10 వేల మెట్రిక్ టన్నులు మిల్లింగ్ కొరకు పౌరసరఫరాల శాఖ అలాట్మెంట్ చేసిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో హార్వెస్టింగ్ కొన్ని ప్రాంతాలలో ఆలస్యంగా జరుగుతుందని, చాలా మండలాలలో ఇంకా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావాల్సి ఉందని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు 100 మట్టి, ఇసుక రవాణా వాహనాలను కూడా ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో స్టోరేజీ ప్లేస్ తక్కువగా ఉన్నందున ఇతర జిల్లాల మిల్లులకు కూడా ట్యాగ్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాలు అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబు రావు, డిఆర్డీఓ బాలకృష్ణ, మోటార్ ఇన్స్పెక్టర్ సుందర్ లాల్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

దశ సూర్యాపేట ప్రతినిధి : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. అవసరమైన వారికి సహాయం చేయడం, పేదలను ఆదుకోవడం బక్రీద్ పండుగ ప్రధాన సందేశమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సోదరభావంతో కలిసి జీవించాలని ఈద్ ఉల్ అజ్హా పండుగ చాటి చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది తదితరులు పాల్గొన్నారు.






## మంత్రి సీతక్కని కలిసిన పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం, తెల్లం



**దశ, భద్రాచలం :** రాష్ట్ర అభివృద్ధి, నియోజకవర్గ ప్రజా సమస్యలు మరియు సంక్షేమ కార్యక్రమాల అమలుపై మంత్రి సీతక్కతో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో రెండు నియోజకవర్గాల్లో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గా అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఐటీసీ ప్రతినిధులు మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన DSP రవీందర్ రెడ్డి



**దశ, మణుగూరు:** బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లీం సోదరులకు మణుగూరు ఈద్గా వద్ద గురువారం మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు ముగిసిన అనంతరం బక్రీద్ వేడుకలలో పాల్గొన్న ప్రతి ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అన్నారు. సేవా భావంతో సమాజంలో మంచి జరిగేలా ఆ ఖురాన్ తెలీపుతుందన్నారు. మణుగూరు ఈద్గా వద్ద భారీసంఖ్యలో ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. బక్రీద్ పండుగ సందర్బంగా మణుగూరు సీఐ నాగబాబు ఆధ్యర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మతపెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## మణుగూరు అంబేద్కర్ సెంటర్లో నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు



**దశ, మణుగూరు:** మణుగూరు అంబేద్కర్ సెంటర్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో తెలుగోడి సత్తాచాటిన ఘనత ఎన్టీఆర్దన్నారు. ఈ కార్యక్రమంలో మణగూరు టీడీపీ నాయకులు వట్టం నారాయణ, చలపతిరావు, బచ్చల భారతి, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఆలయం అభివృద్ధికి రూ.351 కోట్లు



**దశ, భద్రాచలం :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమ్మక్కసారక్క దేవాలయ అభివృద్ధి తరహాలోనే భద్రాచలాన్ని కూడా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి కోసం తొలి విడతలో రూ.351 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆలయ పరిసరాల అభివృద్ధి, రహదారుల విస్తరణ, పార్కింగ్ సదుపాయాలు, భక్తులకు వసతి, తాగునీరు, పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే దిశగా పనులు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ఇది సమష్టికృషితో ముందుకు సాగుతున్న ప్రాజెక్ట్ అని అన్నారు.

# రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ యాప్ ఘనంగా ప్రారంభం





❖ *లాంచ్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు పువ్వాడ అజయ్, నామా*

**దశ, ఖమ్మం:** నిరుద్యోగ యువతకు వరంలా కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి సహకారంతో చక్రవర్తి రూపొందించిన Rakesh Reddy EClasses App ప్రారంభోత్సవం ఖమ్మం ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, RJC కృష్ణ, బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై యాప్‌ను ప్రారంభించారు.

అనంతరం రాకేష్ రెడ్డి గారిని అభినందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావులు మాట్లాడుతూ "కొట్లాది రూపాయల కోచింగ్‌ను నిరుద్యోగులకు ఉచితంగా అందించేందుకు రాకేష్ రెడ్డి మిత్ర బృందం యాప్ రూపొందించడం అభినందనీయం. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడుతున్న ప్రతి విద్యార్థి ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యువత, నిరుద్యోగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. అదే స్ఫూర్తితో రాకేష్ రెడ్డి గారి సేవా దృక్పథం యువతకు ఆదర్శం" అని కొనియాడారు. "యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంది. రాకేష్ రెడ్డి గారు చేస్తున్న కృషి గొప్పది. ఈ ఉచిత యాప్ లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా స్వాలంబన సాధించాలి



❖ *డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క*

**దశ, మధిర:** ఖమ్మంజిల్లామధిరనియోజకవర్గంఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల నిర్వహణ కోసం నిర్మించనున్న హెచ్‌పీసీఎల్ (HPCL) పెట్రోల్ బంక్‌కు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం భూమిపూజ నిర్వహించారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా వ్యాపార రంగంలోనూ రాణించి ఆర్థికంగా స్వావలంబులుగా ఎదగాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళల ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో నిర్వహించబడనున్న ఈ పెట్రోల్ బంక్ గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక బలోపేతానికి దోహదం చేయనుంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు. 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా వ్యాపార భాగస్వాములుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వెంకటాపురంలో నిర్మించనున్న ఈ పెట్రోల్ బంక్ మధిర నియోజకవర్గ మహిళల విజయానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన అన్నారు. మహిళల సాధికారతకు బాటలు వేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులకు మరియు ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ (సీతక్క), స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అకాల వర్షా లతో తడిసినా ధాన్యం కొంటాం

❖ *భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్*



**దశ, కొత్తగూడెం:** మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమైతే చర్యలు అంకిత్ వాణా సమస్యల పరిష్కారానికి శాఖల సమన్వయం ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. వాణా, రెవెన్యూ శాఖల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగిస్తున్నామని, ప్రతి రైస్ మిల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను నియమించి, అదనపు హమాలీలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక అలర్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసిందని తెలిపారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని స్పష్టం చేశారు. రెవెన్యూ, సివిల్ సప్లై, రవాణా శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

## కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరైపై ED దాడులు దుర్మార్గమైన చర్య

❖ *సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు*

**దశ, మణుగూరు:** కేరళ మాజీ ముఖ్యమంత్రి పిన్నరై విజన్‌పై కాంగ్రెస్ బిజెపి కుట్రపూరిత చర్యను ఖండించాలని సిపిఎం మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సిపిఎం ప్రతిపక్ష నాయకుడు మాజీ ముఖ్యమంత్రి పినరై విజయ్‌పై బిజెపి కాంగ్రెస్ మూకలు అనవసరమైన ప్రచారాలు చేస్తూ 2013లో కొట్టేసిన కేసును ఆధారాల కోసమని కేరళ మాజీ ముఖ్యమంత్రిపై వారి కుటుంబసభ్యుల నివాసాలలో ఈడీ దాడులు చేయడం సిగ్గుచేటని సిపిఎం ను సైదాంతికంగా ఎదుర్కోలేక అసత్య ప్రచారాలు అబద్ధపు మాటలతో పూట గడుపుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తూ రాజ్యాంగ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు, బొల్లం రాజు, ములకల ఉత్తం, ఎస్.వెంకట్రావు, గుర్రం నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ 103వ జయంతికి ఘన నివాళులు

❖ *లకారం ట్యాంక్ బండ్ వద్ద పువ్వాడ, నామ, సండ్ర, తాటి నివాళి*



**దశ, ఖమ్మం:** ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ నందు మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావులు మాట్లాడుతూ "తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహా నాయకుడు ఎన్టీఆర్ అని పేదల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన పథకాలు చరిత్రలో నిలిచిపోతాయి. రాజకీయాలకతీతంగా ఎన్టీఆర్ సేవలు స్మరించుకోవాల్సిన అవసరం ఉంది" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

